వ్యాస కౌముది



# తెలుగులో మీకు ఇష్టమైన కథ, నవల ఏది? ఎందుకు నచ్చింది?

ఏప్రిల్ 19, 2020న కాన్ఫరెన్స్ కాల్ మాధ్యమాన జరిగిన

సాహితీ వేదిక, ఢిల్లీ – సమావేశంలో జరిగిన చర్చ

**పాల్గొన్నవారు :**

A సోమలత, B కమలాదేవి, పప్పు శాంతాదేవి, MV లక్ష్మి, NS లక్ష్మి, V నాగజ్యోతి, VLS పద్మ, M శారద, అరుణ శ్రీనివాస్, శాంతిశ్రీ బెనర్జీ, సునీత, T కళ్యాణి, దాసరి అమరేంద్ర, RS వెంకటేశ్వరన్, G వెంకట్‌రామయ్య, M వంశీకృష్ణ, TRN రావు, శ్రీనివాస్ బందా.

**చర్చా సారథి – శాంతిశ్రీ బెనర్జీ**

**దాసరి అమరేంద్ర – కాలాతీత వ్యక్తులు**

కాలాతీత వ్యక్తులు 1957లో డాక్టర్ శ్రీదేవి గారు రాసిన నవల. కథాకాలం 1955. ఆరుగురు యువతీయువకుల కథ ఇది. ఇందులో కళ్యాణి, వసుంధర, కృష్ణమూర్తి, ప్రకాశం విద్యార్థులు. ఇందిర చిరుద్యోగి. చక్రవర్తి డాక్టరు. అందరిదీ గ్రామీణ నేపథ్యం. ఒక్క వసుంధర తప్ప అందరివీ బడుగు కుటుంబాల నేపథ్యం. ప్రపంచానికి భయపడని ఇందిర, ఒబ్బిడిగా ఉండే కళ్యాణి, వెన్నెముకలేని ప్రకాశం, కులాసా మనిషిగా అనిపించే కృష్ణమూర్తి, కష్టాలంటే తెలియని వసుంధర, జీవితానుభవాలతో రాటుదేలిన చక్రవర్తి, నవల ఆరంభంలో కనిపిస్తారు. ఎంతో పటిష్టమైన శిల్పంతో సమర్థవంతంగా చెప్పబడిన నవల చివరకు వచ్చేసరికి కళ్యాణి స్వావలంబన దిశగా ఎదుగుతుంది. కృష్ణమూర్తి జీవితపు క్లిష్టతలను ఎదుర్కొనే మనిషిగా పరిణామం చెందుతాడు. చక్రవర్తి తన స్వీయ స్పష్టత సాయంతో ఇతరుల పరిణితికి దోహదం చేస్తాడు. వసుంధర కష్టనష్టాలను ఎదుర్కొనే స్థితికి చేరుతుంది. ప్రకాశం కాలం నీడల్లో కలసిపోతాడు. ప్రపంచాన్ని కాళ్ల దగ్గరకు తెప్పించుకోగల శక్తిగా నవల ఆరంభంలో పరిచయమయిన ఇందిర చివరాఖరికి తన బరువూ సమస్యల్నీ మోసే సహచరుడికోసం ఎదురుచూసి కృష్ణమూర్తిని ఎనంకొంటుంది. పాత్రల పరిణామాల్ని ఆ ఏభైలనాటి కాలమాన పరిస్థితులతో జోడించి అద్భుతంగా అవిష్కరించారు శ్రీదేవి. ఇందిర విషయంలో ఆ పాత్ర వేసే పిల్లి గంతులు పాఠకులకు ఓ పట్టాన అర్థం కావు. ఏదేమైనా 1955 నాటి కాలాతీత వ్యక్తులు 2020లో కూడా చదువరులకు విభ్రమ కలిగిస్తూనే ఉంటారు.

**B కమలాదేవి**

తెలుగు కథను అంతర్జాతీయ స్థాయికి చేర్చిన పాలగుమ్మి పద్మరాజు రాసిన 'గాలివాన' నాకు నచ్చిన కథ. సంఘంలో ఉన్నత స్థాయికి చెందిన ఒక వ్యక్తి మనస్తత్వాన్ని, విపత్కర పరిస్థితుల్లో ఆయనకి అనుకోకుండా ఒక ముష్టామె అక్కున జేర్చుకుని సముదాయించిన వైనాన్ని వివరిస్తుందీ కథ. ఆమె కౌగిలిలో అతను సేద తీరినందుకు తాత్కాలికంగా కృతజ్ఞత అతనిలో పొడసూపినా, బడుగుజీవులపట్ల తన వర్గానికి సహజంగా ఉండే ద్వేషం, తన గౌరవభంగపు భీతీ అతనిలో మళ్లీ మేల్కొంటాయని ఎంతో గొప్పగా చెప్పారు రచయిత పాలగుమ్మి పద్మరాజు. మనస్తత్వ విశ్లేషణ, వాతావరణానికీ మనస్తత్వాలకీ ఉన్న బంధం – వీటిని చాలా గొప్పగా తెలియజేశారాయన.

**A సోమలత**

నేనెంచుకున్న కథ పి. సత్యవతిగారు రాసిన కథ దమయంతి కూతురు. సౌమ్య తల్లి దమయంతి ఇల్లు విడిచి వెళ్లిపోతుంది. కలత పడిన సౌమ్య మేనత్త దగ్గర పెరుగుతుంది. తల్లి జ్ఞాపకాలు వెంటాడుతూ ఉంటాయి. తండ్రి మరో పెళ్లి చేసుకొంటాడు. అన్నయ్య వేరే వూళ్లో ఉంటాడు. తల్లి అలా వెళ్లిపోయి, తండ్రి మరో రకంగా విస్మరిస్తున్న బాధని అన్నయ్యతో చెప్పగా, 'మనకన్నా దురదృష్టవంతులుంటారు, నీకు నేను, మనకు అత్తయ్యా ఉన్నారు' అంటాడతను. మరి అమ్మ మనకు కలిగించిన క్షోభ సంగతేమిటన్న సౌమ్యకి, 'ఎంత క్షోభ పడి అమ్మ ఇల్లు వదిలి వెళ్లిందో అదీ ఆలోచించాలిగదా' అంటాడా అన్న. క్లుప్తంగా కథ ఇది. సంసార జీవితంలో ఆ తల్లి పడిన క్షోభ ఏమిటో ఎవరికీ తెలియదు. కథలోనూ లేదు. క్షోభ సంగతి అలా ఉంచితే, తల్లి అలా చెయ్యడం సమర్థనీయమేనా? ఏ కారణమూ లేకుండానే ఆవిడ వెళ్లిపోయిందా? శీలం, నైతికత, సహచర్య రాహిత్యం వంటి విషయాలని ఈ కథ చర్చించింది. ఇది నచ్చడం, నచ్చకపోవడమనే ప్రశ్నలే లేవు.

**RS వెంకటేశ్వరన్**

ఉప్పల లక్ష్మణరావు రాసిన బతుకు పుస్తకం – నేనెంచుకున్నాను. జీవితంలో రచనకూ ఆచరణకూ మధ్య తేడాలేని ఇటువంటి రచయితలు కోటికొకరు మాత్రమే తారసపడతారు. లక్ష్మణరావు ఒక స్విస్ యువతిని వివాహం చేసుకున్నారు. రెండు వేర్వేరు దేశాలకి, విభిన్న సాంస్కృతిక సాంప్రదాయిక పరిస్థితుల్లో పెరిగిన ఒక స్త్రీ, ఒక పురుషుడూ వివాహం చేసుకోవాలంటే, ఒకరినొకరు ఎంతగా అర్థం చేసుకోవాలో ఈ పుస్తకం చెప్తుంది. లక్ష్మణరావుగారూ ఆయన భార్యా కమ్యూనిస్టు సిద్ధాంతాలని దాదాపు పదిహేనేళ్లపాటు ఆకళింపు చేసుకున్న తర్వాత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్న వైనం చదువుతే, ఒక విషయాన్ని ఎంత లోతుగా తరచి చూడాలో అర్థమవుతుంది. భార్యాభర్తల మధ్య ఎలాంటి స్వతంత్రముండాలో, ఏ సిద్ధాంతాన్నైనా క్షుణ్ణంగా తెలుసుకోనిదే జీవితంలో ఆచరించడానికి పూనుకోరాదని ఈ పుస్తకం వల్ల తెలుస్తుంది. ఒక సాహితీవేత్త విమర్శని ఎంత సహృదయతతో స్వీకరించాలో ఈ నవల నేర్పింది. ఆయన చేసిన పరిశోధన, ఒక విషయాన్ని తెలుసుకోవడానికి ఒక మనిషికి ఉండవలసిన నిబద్ధత గురించి వివరిస్తుంది. సాహిత్యాన్ని గురించి చెపుతూ, సి వి రామన్, బోస్, అయిన్‌స్టీన్ ఎంత గొప్ప శాస్త్రవేత్తలైనా, ప్రజల్లో విప్లవబీజాలు నాటింది రామ్మోహన్ రాయ్, వీరేశలింగం, గురజాడవంటివారేనని, అందువల్ల నవసమాజ వైతాళికులు రచయితలే అంటారాయన.

**పప్పు శాంత**

మాలతీ చందూర్ రాసిన 'సద్యోగం' అనే నవల నాకు చాలా నచ్చిన నవల. చేపట్టిన వృత్తి పట్ల మనిషికి ఉండవలసిన నిబద్ధతని, అటువంటి నిబద్ధత ఉంటే ఏ వుద్యోగమైనా 'సద్యోగ'మే అవుతుందన్న విషయాన్ని ఆవిడ చాలా చక్కగా వివరించారు. తనకు ద్రోహం తలపెట్టిన వ్యక్తిపట్ల కూడా వృత్తి ధర్మాన్ని నిష్పక్షపాతంగానే నిర్వహించాలని, కేవలం తన దృష్టితో మాత్రమే చూసి మనుషులని బేరీజు వేయడం అసమంజసమని చాలా చక్కటి సంఘటనలని సృష్టించి మనసుకు హత్తుకునేలా అందించారు రచయిత్రి.

**MV లక్ష్మి**

ఈమధ్యనే ప్రచురితమైన 'గూడు' అనే కథగురించి వివరించబోతున్నాను. రచయిత బర్కపల్లి యాదగిరి. మూడో అంతస్తులో నివసించే ముసలమ్మ నర్సవ్వకి పిచ్చికలు అంటే ప్రేమ. తమ ఇంటిచూరులో అవి గూడుకట్టుకోవటానికి ఎంతో కష్టపడి చిన్న ఏర్పాటు చేస్తుంది. అయితే క్రింది పోర్షన్‌లో వాళ్లు ఒప్పుకోక, నానా యాగీచేసి, ఇంటి వోనర్‌కి ఫిర్యాదు చేస్తారు. గూడు తీసెయ్యమని, ఇల్లైనా ఖాళీ చెయ్యమని ఒక్కరోజు టైమిస్తాడు ఇంటి వోనర్. ఆ పిచ్చికల గూడుని కాపాడటానికే అన్నట్లు, గడువు తీరేలోపే నర్సవ్వ ప్రాణం విడుస్తుంది. వాస్తవికంగా ఉన్న కథా చిత్రణ నాకు బాగా నచ్చింది. మనుషుల్లో సాటి మనుషులపట్ల, జీవాలపట్ల తగ్గిపోతున్న సానుభూతి, క్రమేపీ లోపిస్తున్న ఆర్ధ్రతలని చిత్రీకరించే ఈ కథలని, 'సడిలేని గూడు' అనే ప్రతిలిపివారి అంతర్జాల కథాసంకలనంలో చూడవచ్చు.

**NS లక్ష్మి**

రావిశాస్త్రిగారి 'కష్టార్జితం' కథ నాకు చాలా నచ్చింది. సంఘంలో నాటినుంచీ నేటివరకూ కొనసాగుతున్న లంచగొండితనాన్ని, దోపిడీనీ విలక్షణంగా చిత్రించిన కథ ఇది. మనుషుల ప్రవర్తనలు, ప్రవృత్తులని ఇందులో ఎంతో చక్కగా వర్ణించారాయన. ఒకే ఒక పాత్రతో చెప్పదలచుకున్న విషయమంతా చెప్పేశారు. 'కష్టేఫలీ', 'పిండికొద్దీ రొట్టె' వంటి జాతీయాలతోబాటు 'చీకటి ముఖాలవాళ్లు' అనే కొత్త ప్రయోగం కూడా కనిపిస్తుంది ఇందులో.

**V నాగజ్యోతి**

ముప్పాళ్ల రంగనాయకమ్మ రాసిన 'బలిపీఠం', నాకు నచ్చిన ఎన్నో నవలల్లో ఒకటి. ఆదర్శాలని ఆవేశంలో అమలుచేస్తే, దానివల్ల జీవితాలు అతలాకుతలమయ్యే వైనాలని బలిపీఠం కళ్లకు కట్టినట్లు వివరిస్తుంది. క్షణికమైన స్వార్థపు ఆలోచనతో, కులాంతర వివాహానికి సిద్ధపడిన అరుణ పాత్రద్వారా, అలాంటి వాళ్ల జీవితం ఎంత నరకప్రాయం కాగలదో, వాళ్ల పిల్లలు ఎంత మథన పడతారో అన్న విషయాలని, కులాంతర వివాహాలు చేసుకోదల్చిన వాళ్లు ఎంత నిశితంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలో రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేశారు.

**G వెంకట్రామయ్య**

తోలేటి జగన్మోహనరావుగారి 'కప్పదాలు' కథను నేను ఎన్నుకున్నాను. ఎంత సీరియస్ కథావస్తువునైనా హాస్యపూరితంగా చెప్పి ఒప్పించడంలో సిద్ధహస్తుడు తోలేటి. బహుళజాతి సంస్థల ధ్యేయాలెలా ఉంటాయి, వాటి గమ్యాలని చేరుకునే పద్ధతుల వల్ల దేశంలోని ఎన్నో కుటీర పరిశ్రమలు మూతపడుతున్నాయన్న వాస్తవాన్ని, విదేశీ పెట్టుబడులన్న పేరుతో మన ప్రభుత్వాలు వాటి అడుగులకు మడుగులొత్తుతున్న విషయాలని ఈ కథలో చూపారాయన. 92లో మొదలై, 2000 నాటికి పూర్తిగా ఊపందుకున్న ప్రపంచీకరణ 'కన్స్యూమరిజమ్' భూతాన్ని పెంచి పోషిస్తోంది. అప్పట్లో యువతరమే దాని వలలో చిక్కుకున్నారనుకోవచ్చు. కానీ ప్రస్తుతం వయోభేదం లేకుండా అందరూ ఆ ట్రాప్‌లో పడిపోయారు. ఈ కథ 2001, ఇండియా టుడేలోనూ, తర్వాత 'కథ' సంపుటిలోనూ వచ్చింది.

**M శారద**

నాకు నచ్చిన నవల – రావిశాస్త్రిగారి ‘ఇల్లు’. కథాంశం ఇప్పటికీ అన్వయించదగ్గదే. డబ్బున్న ఒక వ్యాపారి ఒక వితంతువు ఆస్తిని ఆక్రమించుకోవడానికి చేసే ప్రయత్నాలని ఈ నవలలో వివరించిన తీరు, పాత్ర, చిత్రణ ఎంతో చక్కగా ఉంటాయి. ఇది అందరూ తప్పకుండా చదవవలసిన నవల.

**M వంశీకృష్ణ**

కవిసామ్రాట్ శ్రీ విశ్వనాధులవారి కావ్యపరిమళము నాకు బాగా నచ్చిన పుస్తకం. మనుచరిత్ర రచించిన అల్లసాని పెద్దనామాత్యునికి ఆంధ్రకవితాపితామహుడన్న పేరు ఎందుకు వచ్చిందో వివరణతో ప్రారంభమై, అందులోని పద్యమాధుర్యము, భావ వైశిష్ట్యము, పదాల పోహాళింపులను మనకందచేస్తూ, తెలుగు పంచకావ్యములలోని మిగతా నాలిగింటితోబాటు మొత్తం 11 కావ్యాలలోని మనోహర పద్యపరిమళ బిందువులను సేకరించి కనకపాత్రలో భావితరాలకు అందించిన మహనీయుడాయన. ఇది ఆషామాషిగా చదవవలసిన పుస్తకంకాదు. ఒక్కొక్కవాక్యాన్ని జాగ్రత్తగా ఆకళింపుచేసుకుని, ఆస్వాదిస్తూ, పిపఠిషను పెంచుకునే పుస్తకం, తెలుగు సాహిత్య అభిమానుల వద్ద తప్పక ఉండదగిన పుస్తకం.

**VLS పద్మ**

ఇది మా మేనమామ BL కాంతారావుగారు నాకోసం రాసిన కథ. తెల్లవారు ఝామునుంచీ ఇంటిపనులన్నీ చక్కబెడుతూ రోజంతా తెరిపిలేకుండా ఉంటుందొక ఇల్లాలు. సాయంత్రం ఏడున్నరకి భోజనం పెట్టమన్న భర్తకి వడ్డిస్తుండగా, 'నువ్వు తిన్నావా' అని అతను అడిగినప్పుడు, ఇంటి పనుల్లోపడి తానా రోజు భోజనమే చెయ్యలేదన్న విషయం గుర్తుకొచ్చి కళ్లనీళ్లు తిరుగుతాయామెకి. అది చూసి ‘నువ్వో ఎమోషనల్ ఫూల్‌వి’ అంటాడు భర్త. అల్లారుముద్దుగా పెరిగిన తను, తన వ్యక్తిత్వాన్నే మర్చిపోయేంతగా అత్తారింట్లో గొడ్డుచాకిరీ చేస్తుంటే ‘ఎమోషనల్ ఫూల్’ అంటాడేమిటీయన అని బాధపడుతుందామె.

**TRN రావు**

కోడూరి పుల్లారెడ్డి రాసిన ‘మా అమ్మ ఓబుళమ్మ’ గురించి చెప్పబోతున్నాను. ఇది మిసిమి సెప్టెంబర్ 2015 లో ప్రచురితమైంది. చిన్నప్పుడు చండశాసనుడైన తండ్రి, పెళ్లయాక బాధ్యతలేని భర్తలతో బాధలుపడుతూ కూడా, రకరకాలుగా రెక్కలు ముక్కలు చేసుకుని నలుగురు కొడుకులని పెద్ద చదువులు చదివించిన ఒక తల్లి యథార్థ గాథ ఇది. ఈరోజు తనూ తన పిల్లలూ తమ్ముళ్లూ వాళ్ల పిల్లల్లో ఎంతోమంది, డాక్టర్లుగా ఇంజనీర్లుగా దేశవిదేశాల్లో స్థిరపడడానికి ఆ తల్లి చేసిన శ్రమే కారణమని, ఆమె పట్ల తనకున్న కృతజ్ఞతని వ్యక్తం చేశారాయన ఈ కథలో.

**శ్రీనివాస్ బందా**

మానవోద్వేగాలని ఒక తాత్విక దృక్కోణంతో విశ్లేషిస్తూ ప్రదర్శించిన వైనం – బుచ్చిబాబు రచించిన ‘చివరకు మిగిలేది’. ఈ పుస్తకాన్ని చదివి చాలా యేళ్లయినా, ఇందులోని పాత్రలు, వాటి సంభాషణలు చాలాసార్లు గుర్తొచ్చిన మాట వాస్తవం. దయానిధి పాత్ర సున్నితత్వానికి, సౌకుమార్యానికి, భావుకతకి, ఆలోచనాన్వితమైన ప్రేమకీ ప్రతిరూపం కాగా, కోమలి పాత్ర ఒకానొక అలౌకికమైన సౌందర్యానికి,

అమాయకత్వం పాలు ఎక్కువైన లౌక్యానికి ప్రతీక. ప్రత్యక్ష పాత్రలే కాక, పరోక్షంగా కథకి ఒక ప్రత్యేకమైన కోణాన్ని సమకూర్చే పాత్ర – దయానిధి తల్లి. వ్యక్తి ఒక ప్రపంచంలో ఉంటున్నప్పటికీ, అతనిలో మరో ప్రపంచం ఉంటుందనే నిజాన్ని అతి చక్కగా ఇందులో పొదిగారు బుచ్చిబాబు. ప్రేమ అనే భావన ఈ రెండు ప్రపంచాల్లోనూ సమానంగా జనించడం, పక్వతకి రావడం అనేది ఒక ఆదర్శవంతమైన విషయమే అని, అంతర్–బహిర్ విశ్వాలమధ్య సయోధ్య సమకూర్చడానికి మనిషి చేసే ప్రయత్నమే 'చివరికి మిగిలేది' అనీ – ఈ నవల చదివిన ఎన్నో ఏళ్లకి నాకు ప్రాక్టికల్‌గా అర్థమైంది. మొత్తానికి మానసిక విశ్లేషణతోబాటు వేదాంతాన్ని కూడా రంగరించిన అపురూపమైన రచన – చివరకు మిగిలేది. అందుకనే అది నాకు చాలా ఇష్టం.

**అరుణ శ్రీనివాస్**

ఈశ్వరి రాసిన 'నాన్నా నేనొచ్చేస్తున్నా' అనే కథని గురించి చెప్తాను. భర్తమీద అలిగి పుట్టింటికి వస్తుందో కూతురు. ఆ విషయం తెలిసిన తెలిసిన తల్లి, తన పెళ్లైన తర్వాత తన తండ్రికి రాసుకొన్న ఉత్తరాలని కూతురికి చూపిస్తుంది. మొదటి వుత్తరంలో తనను అత్తగారూ ఆడబడుచులూ పెడుతున్న ఆరళ్ల గురించీ, వేరు కాపురం పెట్టిన తర్వాత రాసిన రెండో ఉత్తరంలో, చేసిన ప్రతి పనిలోనూ తప్పులెంచుతూ కోప్పడే భర్త గురించీ రాసి ఉంటుంది. చదివిన కూతురికి, తన అవగాహనాలోపం అర్థమై, భర్త దగ్గరకు వెళ్లడానికి సిద్ధపడుతుంది. ప్రస్తుతం, ఎందరో తల్లిదండ్రులు తమ కూతుళ్లకి ఉన్న ఇటువంటి లోపాన్ని సరిదిద్దే ప్రయత్నం చెయ్యకుండా, భార్యాభర్తల మధ్య కీచులాటలు విడాకులవరకూ పోవడానికి దోహదపడుతున్నారనిపిస్తుంది.

**శాంతిశ్రీ బెనర్జీ**

నేను KN మల్లీశ్వరి రాసిన 'నీల' నవలని ఎంచుకున్నాను. రచయిత్రి కవితాత్మక శైలి భావోద్వేగాలతో సమృద్ధమైంది. విక్టోరియన్ కాలపు నవలా శిల్పం దగ్గరే ఆగిపోయిన తెలుగు కథలో, ఒక ఈస్థటిక్ టర్న్ రాగలదన్న ఆశ కలిగిస్తుందీ నవల అని, ముందుమాట రాసిన వాడ్రేవు చినవీరభద్రుడు అంటారు. తల్లి అక్రమ సంబంధం వల్ల అనాథ అయిన నీలవేణి, జీవితంలో ఎవరో ఒకర్నే ప్రేమించాలని నిర్ణయించుకుంటుంది. ఆమెకి ప్రసాద్‌తో పెళ్లి జరిగినా, అతనికి అప్పటికే ఇంకొకరితో సంబంధం ఉందని వదిలేస్తుంది. కాలక్రమేణా ఆమెకి పరదేశి, సదాశివలు ఆమె జీవితంలోకి ప్రవేశిస్తారు. ఒక వ్యక్తితో సంబంధం ఉన్న పరదేశిని వదులుకొని, అనేక బంధాల్లో ఉన్న సదాశివతో బంధాన్ని నీల ఎలా అంగీకరించిందన్న ప్రశ్న వస్తుంది. కానీ, నవల పూర్తయేసరికి, సదాశివ నీలతో తన జీవితాన్ని ముడివేసుకోవడం చూశాక, నీల చేసింది సరైనదే అనిపిస్తుంది. ప్రతి మనిషికీ ఇతరుల సహకారం అవసరముంటుంది. నీల చుట్టూ అటువంటి మనుషులని సృష్టించి కథని చక్కగా నడిపారు మల్లీశ్వరి. అలాగే ప్రతి కుటుంబంలోనూ తరాల మధ్య అంతరాలు ఉంటాయన్న సత్యాన్ని కూడా మల్లీ ఫోకస్‌లోకి తెచ్చారు.

**మన్నవ పద్మ**

నాకు నచ్చిన కథ – మధురాంతకం రాజారామ్ గారి రచన – గ్రూప్ ఫోటో. నాలుగు వాటాల ఇంటిలో అద్దెకుంటున్నా చుట్టుపక్కల వారితో సంబంధం లేకుండా, ఎవరైనా పలకరించినా తన నుంచి ఏదో ప్రయోజనం పొందాలనే మాట కలిపారు అనుకుంటూ ఉండేవాడు. అతని గది గోడల మీద అతని ఫోటో మాత్రమే వివిధ భంగిమలలో కనిపిస్తూ ఉండేది. ఒకరోజు అతనికి ప్రమాదం జరుగుతుంది. అదే రోజు అతని తండ్రి ఊరినుంచి వచ్చేసరికి ఇరుగుపొరుగు వారు పలకరించి, భోజనాదికాలు ఏర్పాటు చేసి, సత్యాన్ని వెతికి ఇంటికి తీసుకొచ్చి వైద్యం

చేయిస్తారు. అంతా కలిసి వంతులవారీగా సత్యాన్ని కంటికి రెప్పలా చూసుకున్నారు. తండ్రికి ధైర్యం చెప్పి అండగా ఉన్నారు. కోలుకున్న సత్యంలో మార్పు వచ్చి, గోడమీద అందరితోపాటూ ఉన్న గ్రూప్ ఫోటోలో నవ్వుతూ కనిపిస్తాడు. మనిషి సంఘజీవి అనీ, అందరితో కలిసి ఉంటేనే క్షేమం, సంతోషం అని రచయిత చెప్పిన విధానం చాలా బాగుంది.

★ ★ ★

## నాకు నచ్చిన అనువాద కథ/నవల

ఏప్రిల్ 26, 2020న కాన్ఫరెన్స్ కాల్ మాధ్యమాన జరిగిన

సాహితీ వేదిక, ఢిల్లీ – సమావేశంలో జరిగిన చర్చ

**పాల్గొన్నవారు :**

A సోమలత, MV లక్ష్మి, NS లక్ష్మి, V నాగజ్యోతి, అరుణ శ్రీనివాస్, శాంతిశ్రీ బెనర్జీ, T కళ్యాణి, దాసరి అమరేంద్ర, RS వెంకటేశ్వరన్, G వెంకట్‌రామయ్య, M వంశీకృష్ణ, TRN రావు, శ్రీనివాస్ బందా, B కమలాదేవి, M శారద, పప్పు శాంతాదేవి.

**చర్చా సారథి – MV లక్ష్మి**

**TRN రావు**

**నేపాలీమండూకం సాహసాలు – (ఆంగ్ల మూలం – కణక్ మణి దీక్షిత్; అనువాదం – దాసరి అమరేంద్ర)**

నోరులేని ప్రాణులతో నడిచే కథ ఇది. నేపాల్ గురించి మనకి తెలిసిన విశేషాలతోబాటు తెలియని ఎన్నో స్థలాల గురించీ ఇతర విశేషాలగురించి ప్రస్తావన ఇందులో ఉంది. అనేకమైన సాంఘిక వ్యవహారాల గురించే కాక, పర్యావరణానికి చెందిన విషయాలని కూడా ఈ నవల స్పృశించింది. ప్రతి ప్రాణి జీవితంలోనూ ఎదురయే ఇబ్బందులకు ఎలాంటి ప్రతిస్పందనలు చూపితే పని సానుకూలమౌతుందో ఈ నవల్లో వివిధ సంఘటనలని కల్పించి వివరించారు. మండూక కథానాయకుడు భక్త ప్రసాద్ తమో, రజో, సత్వగుణాల్లోకి రూపాంతరం చెంది, ఆత్మసాక్షాత్కారాన్ని పొందడం నాకు నచ్చింది.

**పప్పు శాంత**

**గీతాంజలి– (ఆంగ్ల మూలం – రవీంద్ర నాథ్ టాగోర్; అనువాదం – చలం)**

ఈశ్వరుడు వాస్తవమేనా అని సందేహించే వారికి సమాధానమిస్తూ 'నీ అల్పమైన ఆశలు, క్షుద్రమైన కోరికలు నీ అంతర్దృష్టిని కప్పడం వలన నీకు తెలియట్లేదు, మా మాటలని విశ్వసించు' అంటూ గీతాంజలిని రవీంద్రుడు గానం చేశారంటారు చలంగారు. పదపదమూ అనువదిస్తూ, కొంత తన శైలిని చొప్పించి, తద్వారా మాతృక లోని రచయిత శైలిని నిలబెట్టి, భావాన్ని పలికిస్తూ, అందంగా అనువదించే కార్యాన్ని చేపట్టారు. టాగూర్ వేదాంతాన్నంతా చిన్న పదాలలో, నిగూఢమైన పదాలలో పొందుపరచారు. ప్రతి గేయంలోనూ, పదంలోనూ అందం, క్లుప్తత, సరళత కనిపిస్తాయి. గీతాంజలి వ్రాసిన రవీంద్రుడు 'విశ్వకవి' అయితే, ఆ గీతాంజలిని 'మూలం' లోని కవితాంశ కరిగి పోకుండా, భావం బాట తప్పకుండా, గుణాలన్నీ ద్విగుణీకృతం చేసి తనదైన రీతిలో భాషలో తెలుగువారికి అందించిన చలంగారిని మనం 'అమరకవి' అనవచ్చు.

**RS వెంకటేశ్వరన్**

**బ్రాహ్మణ కన్య – (మరాఠీ మూలం – శ్రీధర వెంకటేస్య కేట్కర్; అనువాదం – కనక మేడల; ప్రచురణ – నేషనల్ బుక్ ట్రస్ట్ –1974)**

కులాల ప్రాతిపదికగా మనుషులను వేరు చేయడం ఈ దేశానికి వున్న జాడ్యం. ఆ జాడ్యమే మరింత పెరిగి యింకా సమాజాన్ని ఎంత నికృష్టంగా తయారు చేస్తోందో, దానికి పరిష్కారం ఏమిటో చెప్పిన నవల. శాస్త్రాల ప్రకారం తండ్రి బట్టే ఒక వ్యక్తి కులం నిర్ణయించబడాల్సి ఉన్నా, దానికి విరుద్దంగా తల్లి ప్రకారమే నిర్ణయించబడి , కుల వివక్ష మరింత పెరుగుతోందని చెప్పడమే నవల ప్రధానోద్దేశ్యం. 1928 ప్రాంతంలో యిలాంటి నవల రాయడానికి పూనుకోవటం పెద్ద సాహసమే. సమాజంలో వేరు వేరు జాతులూ, ధర్మాలూ ఆచార వ్యవహారాలూ వేళ్ళు పాతుకుని వున్నంతవరకూ, కేవలం సంస్కరణల వలన ఈ సమస్య సమసిపోదని, ఒక రకంగా భండార్కర్, అగార్కర్ లాంటి సంస్కర్తల విధానంలో వుండే డొల్లతనాన్ని పాత్రల చర్చల ద్వారా చెప్పిస్తారు రచయిత. కేవలం సంస్కరణలపై ఆధారపడి సమాజంలో మార్పు రావటం అసంభవం అని నవలలో తెలియజేస్తారు.

**దాసరి అమరేంద్ర**

**రహస్య భారతంలో నా ఆధ్యాత్మిక అన్వేషణ – (ఆంగ్ల మూలం – పాల్ బ్రంటన్; అనువాదం – జొన్నవిత్తుల పతంజలి)**

బ్రిటిష్ పాత్రికేయుడు పాల్ బ్రంటన్ భారతీయ యోగుల మహిమలను గురించి విని, నిజం తెలుసుకోవడం కోసం భారతదేశాన్ని సందర్శించాడు. మెహెర్ బాబా, మౌని బాబాలవంటి వారిని కలిసి, కొన్ని అలౌకిక అనుభవాలు చవిచూసేక, అలాంటి అనుభవాల మీద ఉన్న అపనమ్మకం తొలగి, ఆత్మజ్ఞానశోధనలో పడతాడు. అతని ప్రయాణంలో ఎన్నో రకాల వ్యక్తులు తారసపడతారు. మతమూ, ఆధ్యాత్మికతా వేరు అన్నట్లు సాగుతూ, గారడీలు, జ్యోతిష్యం వంటివాటిని చదువరులమీద రుద్దకుండా చెప్పడం ఒక విశేషం. చివరికి అరుణాచలం రమణుని ఆశ్రమలో ఆత్మ సాక్షాత్కారం పొంది, అంతులేని ఆనందాన్ని, కాంతినీ, స్వేచ్ఛనీ అనుభవించిన బ్రంటన్, దాన్ని మనకి తెలియజేసే ప్రయత్నం చేస్తాడీ పుస్తకంలో. అనువాదం చక్కగా సాగింది.

**V నాగజ్యోతి**

**ఒక తల్లి కథ – మహాశ్వేతాదేవి (బెంగాలీ మూలం – హజార్ చౌరాసి కి మా; అనువాదం–సూరంపూడి సీతారాం).**

ఇది ఒక తల్లి కథ. నక్సలైట్ ఉద్యమంలో భాగమైన అనేక తనయుల తల్లుల కథ. రచయిత్రి యువతరం ఆలోచనలని, ఆవేశాన్ని వ్యక్తపరిచారు. ఉన్నత కుటుంబీకుల అరాచకత్వం, వారి అడుగులకి మడుగులొత్తే పోలీస్ శాఖ వల్ల జరిగే అనర్ధాలు, తద్వారా బలి అవుతున్న యువకుల గురించి తెలిపారు. ఇందులో నాకు నచ్చినది – ఎదుగుతున్న పిల్లల స్వభావం, ప్రవర్తన సకాలంలో తల్లి తండ్రులు తెలుసుకోకపోతే పరిణామాలు దారుణంగా ఉండవచ్చని చేసిన హెచ్చరిక.

**శ్రీనివాస్ బందా**

**కలకత్తాకి దగ్గరలో (బెంగాలీ మూలం – గజేంద్ర కుమార మిత్ర; అనువాదం – మద్దిపట్ల సూరి)**

దాదాపు శతాబ్దకాలం క్రితం, వంగదేశంలోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో జరిగిన వృత్తాంతం ఈ ‘కలకత్తాకి దగ్గిరలో’ అన్న నవల. తినడానికి రెండుపూటలా తిండి లేకపోయినా, పూజాదికాలని, బాల్యవివాహాలవంటి దురాచారాలని కూడా గుడ్డిగా పాటిస్తున్న కాలంలో, ఒక బ్రాహ్మణ కుటుంబంలో మగవారి బాధ్యతారాహిత్యం, అసభ్య ప్రవర్తనల కారణంగా వారి భార్యలు, తల్లులు చవిచూసిన శారీరకమైన కష్టాలని, ఆకలి బాధలని, మానసిక వేదనలని, దిక్కుతోచని ఆడువారి ఆలోచనలనీ, రచయిత ఎంతో లోతుగా వర్ణించారీ పుస్తకంలో. మహిళలు భర్తగానీ, అత్తగారుగానీ పెట్టే ఆరళ్లని భరిస్తూ, నలుగురూ ఏమనుకుంటారో అనుకుంటూ ఆలోచనలని కుంచింపజేసుకోకుండా ధైర్యంగా

ముందడుగు వెయ్యాలన్న సందేశాన్ని నవలలో ఎంతో కన్విన్సింగ్‌గా చెప్పటం జరిగింది. అనువాదం అక్కడక్కడా కొంత నిరాశాజనకంగా అనిపించింది.

B కమలాదేవి

**హృదయసీమ (కన్నడ మూలం– సుధామూర్తి; అనువాదం – రాజారామమోహనరావు)**

మృదుల సంజయ్ ల వివాహం జరిగి కాపురం కొంతకాలం సజావుగా సాగుతుంది. సంజయ్ లౌక్యం నేర్చుకుని ప్రైవేటు నర్సింగ్ హోమ్ పెట్టుకొని అంచలంచెలుగా పైకి ఎదుగుతాడు. ప్రవృత్తిలో ప్రవర్తనలో మార్పు వస్తుంది. మృదుల మొదటినుంచి తుదివరకు ఒకేలా ఉంటుంది. సంజయ్ లో ధనవ్యామోహం పెరిగిందని గ్రహిస్తుంది. డిప్రెషన్ కి గురై అందులోంచి బయటపడ్డా అతనితో ఇమడలేక తన గ్రామం వెళ్లిపోతుంది. దగ్గర ఉన్నంతకాలం ఆమె విలువను గుర్తించని సంజయ్, చివరకు ఆమె దగ్గరకు చేరతాడు. ఈ నవలలో పాత్ర చిత్రణ, సన్నివేశ కల్పనలు, భిన్న ప్రవృత్తులు, స్వభావాలు, ఆధునిక పోకడలు, కాలానుగుణమైన మార్పులు కానవస్తాయి.

A సోమలత

**నాకొక భార్య కావాలి (ఆంగ్ల మూలం – దూడీ బ్రాడీ – అనువాదం – మహమ్మద్ ఖదీర్‌బాబు)**

కొందరు మగవాళ్లు గురివింద గింజ చందంగా, తమ సంగతెలా ఉన్నా కట్టుకోబోయే భార్య మాత్రం 'అలా ఉండాలి, ఇలా ఉండాలి, అంటూ గొంతెమ్మకోరికలు కోరే వైనాన్ని ఒకింత హాస్య ధోరణిలో వర్ణించిందీ కథ.

శాంతిశ్రీ బెనర్జీ

**ఒక హిజ్రా ఆత్మకథ (తమిళ మూలం – రేవతి; ఆంగ్లం నించి తెలుగు – పి . సత్యవతి – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 2014 ).**

తమిళనాడులో ఒక మధ్య తరగతి కుటుంబంలో మగపిల్లవాడిగా పుట్టి, ఆడదానిగా మారాలని, పురుషాంగాన్ని శస్త్ర చికిత్సతో తొలగించుకుని, దొరైస్వామి అనే మనిషి రేవతి అనే హిజ్రాగా మారి, అలాంటి వారి జీవితం ఎలా వుంటుందో సమాజానికి తెలియజేయాలన్న ప్రయత్నంతో రాసుకున్న స్వీయచరిత్రే ఈ పుస్తకం. వ్యక్తిగత జీవితంలో ఎన్నో అవమానాలనూ, బాధలనూ ఎదుర్కొన్న రచయిత్రి బెంగుళూరులో స్థిరపడి, స్వలింగ సంపర్గం ఉన్న వ్యక్తులూ, హిజ్రాలూ కలిసి వారి హక్కులకై పోరాడుతున్న "సంగం" అనే సంస్థతో పరిచయం కావడం, ఆ తరువాతే ఆత్మహత్య చేసుకోవాలన్న కోర్కె తనలో అంతం కావడం చెప్పిన వైనం, పాఠకులను కొంతైనా కదిలించక మానదు. వారి పట్ల మనం మెలగాల్సిన తీరు గురించి ఆలోచన కలిగిస్తుంది.

NS లక్ష్మి

**మహాశ్వేత (కన్నడ మూలం– సుధామూర్తి; అనువాదం – జగదీశ్వరి)**

బాహ్య సౌందర్యం కన్నా అంతరంగ సౌందర్యమే మిన్న అని, ప్రేమాభిమానాలతోబాటు ఆత్మవిశ్వాసంకూడా ఉన్న మహిళలు, భర్త అండదండలూ ఆప్యాయతా దక్కకపోయినా సాధించగల శిఖరాలెన్నో ఉంటాయనీ హృద్యంగా చెప్పిన నవల ఇది. సంస్కృత కవులనూ కథలనూ ఇందులో కథోచితంగా అమర్చి పునశ్చరణ చేయించిన తీరు బాగుంది.

MV లక్ష్మి

**కెరటాలు (హిందీ మూలం – అమర్ కాంత్; అనువాదం – పాలకోడేటి కృష్ణమూర్తి)**

కొత్తగా పొరుగులోకి వచ్చిన మహిళని భర్త పెట్టే బాధలు విని, మిగిలిన మహిళలంతా ఆమెకు అండగా నిలుస్తారు. ఈ క్రమంలో జరిగే సంఘటనలు, పెనిమిట్ల ధాష్టీకం, మరో ఆలోచనలేకుండా వాళ్ల అడుగులకి మడుగులొత్తే మహిళల మనస్తత్వాల్లో వచ్చిన మార్పులు చాలా

చక్కగా వివరించిన నవల ఇది. పాత్రోచిత సంభాషణలు ఆకట్టుకుంటాయి, పాత్ర చిత్రణ చాలా బాగుంది. మూల రచనకి భంగం వాటిల్లకుండా స్వేచ్ఛానువాదం చేసారు.

M శారద

**అమ్మ (రష్యన్ మూలం – మాక్సిం గోర్కీ)**

రష్యన్ విప్లవాత్మక ఉద్యమంపై గోర్కీ రచన 'అమ్మ'. నవల వెనుక రాజకీయ ఎజెండా స్పష్టంగా ఉంది. కథ అన్నా నీలోవ్నా జలోమోవా, ఆమె కొడుకు చుట్టూ తిరుగుతుంది. నవలలో, ఒక మహిళ జీవితాన్ని చిత్రీకరిస్తాడు రచయిత. ఆమె భర్త మరణిస్తాడు. కొడుకు పావెల్ అకస్మాత్తుగా విప్లవాత్మక కార్యకలాపాలలో పాల్గొంటాడు. ఇంటికి పుస్తకాలు తీసుకురావడం ప్రారంభిస్తాడు. నిరక్షరాస్యురాలు, రాజకీయ ఆసక్తి లేని నీలోవ్నా పావెల్ కి సహాయం చేయాలనుకుంటుంది. పావెల్ ది విప్లవాత్మక పాత్ర అయినా, నీలోవ్నా, తన తొలి భావనలను అధిగమించి, చదువురానిదయినప్పటికీ, విప్లవంలో చేరడానికి రాజకీయ అజ్ఞానాన్ని అధిగమించి, ఈ నవలలో అసలు హీరోగా పరిణమిస్తుంది.

మన్నవ పద్మ

**ఆరో ఆడపిల్ల (మళయాళీ మూలం – సేతు; అనువాదం – LR స్వామి)**

సమాజంలోని పురుషాధిక్యాన్ని తేటతెల్లం చేసే నవల 'ఆరో ఆడపిల్ల'. కథ చిన్నదే. కాని ఆ కథ ద్వారా చిత్రీకరించిన ప్రపంచం చాలా విస్తృతం. పూల వ్యాపారి ఐన, పిల్లలు లేని శంకర్ రామన్ గుడి ప్రాంగణంలో నుంచి తెచ్చిన అనాథ బాలికను ఇంటికి తెచ్చి 'కాదంబరి' అని పేరుపెట్టి పెంచుతాడు. ఈ పురుష ప్రపంచంలో అడుగడుగున కాదంబరి ఎదుర్కొనే పీడనలు, సమాజంలోని ఉన్నతుల వివక్ష చివరికి శంకర్ రామన్ లో కూడా కనబడిన పురుషాధిక్య ధోరణి వగైరాలు బాహ్యంగా కనబడే అంశాలు. ఆ అంశాలను పట్టుకొని సమాజం లోతుకీ పురుషాధిక్యతనూ స్త్రీల మనస్తత్వపు లోతులకూ మనను తీసుకొని వెళ్తాడు రచయిత.

★ ★ ★

చక్కటి సుహృద్భావ వాతావరణంలో, ఎన్నో చక్కటి అనువాద కథలు, నవలల పరిచయంతో, సభ్యులు వాటి గురించి చేసిన విశ్లేషణలతో సమావేశం ముగిసింది.

***